ఆరోగ్యశ్రీకి అనారోగ్యం

నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు అందని వైనం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఆరోగ్య కింద పేదలకు ఉచితంగా వైద్యం అందించేలా తీసుకొచ్చిన ఈ పథకం గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జిల్లాలోని ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వైద్యం అందించేందుకు నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం విముఖత చూపుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరోగ్య శ్రీ అమలు చేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో 59,892 సర్జరీలు ఈ ఏడాది నిర్వహించారు. వీరి చెల్లించిన మొత్తం రూ.216.96 కోట్లు మాత్రమే దాదాపు రూ. 5 వందల కోట్లు చెల్లించాల్సి ఉందని నెట్‌వర్క్ ఆసుపత్రులు యాజమాన్యం చెబుతోంది. ఎన్‌టిఆర్ వైద్య సేవ పేరుతో సర్జరీలు చేసుకొని ఇంటి వద్ద ఉన్న రోగులకు కూటమి ప్రభుత్వంలో ఈ ఏడాది ఏప్రిల్ నుండీ మే వరకు 17,388 మందికి 8.76 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. గత ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ క్రింద నెట్ వర్క్ ఆసుపత్రలు చేసిన సర్జీలకు చెల్లించాల్సిన నిధులు చెల్లింపులో అలస్య కావడంతో జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఆసుపత్రలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరోగ్యశ్రీ క్రింద దాదాపు 90కి పైగా నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 12,56,000 ఆరోగ్యశ్రీ కార్డులున్నాయి. ఆరోగ్య శ్రీకార్డుదారులకు నెట్ వర్క్ ఆసుపత్రులు ఉచితంగా సేవలు అందించాలని వైద్య సేవల బిల్లులు అలస్యం కావడంతో కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్ ఆసుపత్రులు ఓపీలకు మాత్రమే పరిమితం అవుతున్నట్లు తెలుస్తోంది. 2022 లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో 30 నుంచి 40 శాతం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం ఆతరువాత పట్టించుకోవడం లేదంటున్నారు.

నిధుల మంజూరు అంతమాత్రమే...

ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం తక్కువ నిధులు చెల్లిస్తోంది. దీనికితోడు నెలల తరబడీ బిల్లులు ఇవ్వకపోవడంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారు. పలువురు అప్పులు చేసి అసుపత్రులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బిల్లులు సకాలంలో రాకపోవడంతో వైద్యులు, సిబ్బంది వేతనాలు చెల్లించలేని పరిస్థితి. బ్యాంకు రుణాలు నిర్వాహకులకు భారంగా మారుతోంది. కొన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు రోగులకు చేర్చుకోవడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో అప్పులు చేసి ఆరోగ్యశ్రీ కార్డులున్నా...ప్రయివేటు ఆసుపత్రుల్లో వేలకువేలు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది.

ఆరోగ్య శ్రీ ద్వారా ఇలా వైద్యం పొందాలి..

ఆరోగ్యశ్రీ ద్వారా రోగి జబ్బును నిర్ధారించిన తర్వాత శస్త్రచికిత్స , వైద్యం వంటి వాటిని పరిగణనలోకి తీసుకునో ఆరోగ్య మిత్రల ద్వారా నమోదు చేసి కేసు వివరాలు ఆరోగ్యశ్రీ ట్రస్టుకు పంపుతారు. చికిత్సకు ఆమోదం వచ్చిన వెంటనే రోగికి ఆపరేషన్, వైద్య చికిత్సలు అందించిన తర్వాత కేసు వివరాలు పంపుతారు. రోగి అసుపత్రులో ఉన్నన్ని రోజులు వైద్య పరీక్షలు, మందులు, మెనూ ప్రకారం భోజనం అందించాలి. ఇంటికి వెళ్లే సమయంలో మందులు, ఛార్జీలకు నగదు ఇవ్వాలి. అసరా పథకం కింద ప్రభుత్వం నుంచి నేరుగా రోగి ఖాతాలో నగదు జమవుతుంది. ఆరోగ్యశ్రీ కింద రోగులకు వైద్యం అందించిన ఆసుపత్రులకు ప్రభుత్వం రెండు, మూడు నెలల్లో బిల్లులు చెలిస్తుంది. కేసుకు సంబందించిన వివరాలు సక్రమంగా ఆన్‌లైనంలో నమోదు చేయకుంటే నిధుల్లో కోత పెడుతుంది. తమకు వైద్యసేవలు సక్రమంగా అందలేదని, అదనపు ఫీజులు వసూలు చేశారని రోగి ఫిర్యాదు చేస్తే ఇలాంటి అసుపత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ఈతకెళ్లి యువకుల మృతి

వెలికి తీసిన దౌహిద్ మృతదేహం

వెలికి తీసిన ఇర్ఫాన్ మృతదేహం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చెరువులో సరదాగా ఈతకెళ్లిన ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం మండలం లోని ఊటువంక చెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తగ్గువారి పల్లి పంచా యతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన ఖాదర్ బాషా కుమారుడు దౌహిద్(16), అదే గ్రామానికి చెందిన మహబూబ్ బాషా కుమారుడు ఇర్ఫాన్ (16) ఊటువంక చెరువులో స్నానం చేసేందుకు ఈతకు వెళ్లారు. వీరికి ఈత రాకపోవడంతో చెరువులో ఉన్న పెద్ద గోతిలో మునిగి మృతి చెందారు. వీరి కోసం గాలించిన బంధువులు చెరువు వద్దకు వెళ్లి చూసి మృతదేహాల కోసం వెతికారు. వారిలో దౌహిద్ మృతదేహాన్ని కష్టంతో బయటకు తీశారు. అయితే ఇర్ఫాన్ మృతదేహాన్ని స్థానికులు ఎంత గాలించినా కనబడక పోవడంతో చిత్తూరు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారి సంఘటనా స్థలం వద్దకు వచ్చి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఇద్దరి మృతదేహాలను బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుల మృతితో తగ్గువారిపల్లి పంచాయతీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కరపత్రాల విడుదల

మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: నిత్యం సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం, జిల్లా అభివృద్ధి కోసం నిజాయితీగా నిస్వార్థంగా పాటుపడుతూ పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి బాటలో కృషి చేస్తున్న సిపిఎం 14వ జిల్లా మహాసభలు ఈ నెల 26, 27వ తేదీల్లో చిత్తూరులో జరుగుతున్నాయని వీటిని జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు గురువారం చిత్తూరులో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో విశిష్టమైన పాత్ర నిర్వహిస్తూ సిపిఎం అనేక ఉద్యమాలు చేస్తోందని, చిత్తూరు జిల్లా ఏర్పడిన తర్వాత నిత్యం కరువుతో విలయ తాండవం చేస్తున్న చిత్తూరు జిల్లా అభివృద్ధికి, రైతాంగాన్ని ఆదుకోవడానికి, సాగునీరు ప్రాజెక్టులు హంద్రీ-నీవా కాలువను పూర్తి చేయాలని సిపిఎం పోరాడుతోందని, నగరిలో వేలాది మంది పవర్ లూం కార్మికుల సమస్యలపై నాలుగు గంలు జాతీయ రహదారిని దిగ్బంధం చేసి పోరాటాలు చేసి అండగా నిల్చిందన్నారు. దళితురాలు ఉమా మహేశ్వరి ఇంటి పని చేస్తుండగా దొంగతనం కేసు పెట్టి పోలీసులతో చిత్రహింసలు చేస్తే ఆమెకు అండగా నిలబడిందన్నారు. మహిళలపై , బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తోందన్నారు. నగరి, పలమనేరు, చిత్తూరు ప్రాంతాల్లో భూ సమస్యలపై ఉద్యమాలు చేసి బాధితులకు న్యాయం చేసేందుకు పోరాడు తోందన్నారు. జిల్లాలో స్కీమ్ వర్కర్ల పోరాటానికి అండగా నిలబడి పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అసంఘటిత రంగంలో ఆటో, బిల్డింగ్ , హమాలీ తదితర రంగాల కార్మికుల సమస్యలపై పోరాడుతోందన్నారు. ఉపాధి హామీ బలోపేతానికి బలమైన పోరాటం చేసిందని, చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, సామాన్య ప్రజల గొంతుకుగా వ్యవహరిస్తూ సిపిఎం ఉద్యమాలకు ప్రజలే అండగా ఉంటూ నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ మహాసభ జయప్రదం కోసం జిల్లా ప్రజలు తమ వంతు ఆర్థికసాయం అందించి జయప్రదానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ మహాసభల్లో గత మూడు సంవత్సరాలు నిర్వహించిన కార్యక్ర మా లు, అనుభవాలను సమీక్షించి రాబోయే మూడు సంవత్సరాల్లో ప్రజా సమస్యలపై బలమైన పోరాటాలకు పదును పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కే సురేంద్రన్, నాయకులు జ్యోతి, దాస్, లోకనాథం పాల్గొన్నారు.

దీక్ష చేపట్టిన ట్రేడ్ యూనియన్, రైతు సంఘాల నాయకులు

కొనసాగుతున్న ఉక్కు దీక్ష

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు..' అనే నినాదంతో స్థానిక గాంధీ విగ్రహం ఎదుట సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు చేపట్టిన దీక్ష గురువారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సురేంద్ర, ఏఐటీయూసీ నాయకులు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను యధాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపి కార్మికులను రోడ్డు పాలు కాకుండా వాళ్ల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో జోక్యం చేసుకొని ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మునిరత్నం నాయుడు, గోపీనాథ్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రసిడెంట్ కె రమాదేవి పాల్గొన్నారు.

'కల్వకుంట ఎన్టీఆర్' జలాశయం పరిశీలన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నగర శివారులోని కల్వకుంట ఎన్టీఆర్ జలాశయాన్ని చిత్తూరు నగర కమిషనర్ పి నరసింహప్రసాద్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం జలా శయంలో నీటి మట్టం ఎంత వుంది? రోజుకు ఎంత నీటిని వినియోగిస్తున్నారు? ఇంకా ఎన్ని రోజులకు సరిపడే నీటి నిల్వలు ఉన్నా యనే అంశాలను పరిశీలించారు. అనంతరం జలాశయం పంప్ హౌస్‌లో మోటార్లను తనిఖీ చేశారు. మోటార్ల రన్నింగ్ టైం, రికార్డులను తనిఖీ చేశారు. మోటార్లు, పంపుసెట్ల నిర్వహణ పక్కాగా చేయాలని, రిపేర్లు ఉంటే ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. పూణేపల్లి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేసి నీటి శుద్ధీకరణ తీరును, క్లోరినేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చొరవ చూపండి : జేసి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆర్డిఓలను, తహశీల్దార్లను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారం, ఫ్రీ హెూల్డ్ రైట్స్ లకు సంబంధించిన రెవెన్యూ సంబంధిత అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జే సి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిర్వహిస్తున్నామని సమస్య పరిష్కారం నిమిత్తం వచ్చే ప్రజల అర్జీల పరిష్కారం నిమిత్తం రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు ఎండార్స్మెంట్ ఇవ్వాలని, అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కారం చేయాలని, బియాండ్ ఎస్ ఎల్ ఏ కు వెళ్ళకుండా చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ కాకుండా సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు పరిష్కారం కాని సమస్యలకు సంబంధించి పరిష్కారం చేయకపోవడానికి గల కారణాలను సవివరంగా అర్జీదారునికి వివరిస్తూ ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. దీనితో పాటు రెవెన్యూ సంబంధిత అంశాల పై ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రుల కార్యాలయం నుండి అందిన అర్జీల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టాలన్నారు. ఫ్రీ హెూల్డ్ రైట్స్ భూములకు సంబంధించిన రికార్డు లను సి సి ఎల్ ఏ నందు అందిన ప్రొఫార్మా మేరకు తహశీల్దార్ లు శుక్రవారం నాటికి ఆర్ డి ఓ లకు అందజేయాలని, ఆర్ డి ఓ లు క్రోడీకరించి నివేదికను శనివారం నాటికి కలెక్టరేట్ కు అందజేయాలని సూచించారు. ఈ విషయంలో తహశీల్దార్లు రికార్డులను పూర్తిగా పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. నేషనల్ హైవే కి సంబంధించి పెండింగ్ లో ఉన్న క్లెయిమ్ లను పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు డి ఆర్ ఓ బి. పుల్లయ్య, కలెక్టరేట్ ఏ ఓ కులశేఖర్, సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్ లు, పాల్గొన్నారు.

చిన్నారి హత్య బాధాకరం

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరులో చిన్నారి అస్ఫియా హత్యకు గురి కావడం చాలా బాధాకరమైన విషయమని ఇది దురదృష్టకరమని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రుకియా బేగం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన చిన్నారి అస్ఫియా మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని గురువారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిన్నారి కుటుంబ సభ్యులను ఇంటికి వెళ్లి మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పుంగనూరులో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం బాధాకరమని అస్ఫియాను ఏ రోజూ ఎక్కడికీ పంపని వారి తల్లిదండ్రులు వారి కుటుంబంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. పోలీసులు బాగా స్పందించి చాలా కష్టపడ్డారనిప్రశంసించారు. ఈ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం పనిచేస్తుందని త్వరలో దోషులను పట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాధవరెడ్డి, సుహేల్ బాష, సివిరెడ్డి, పోలీస్ గిరి, డీఎస్పీ ప్రభాకర్, సిఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా కెవిపిఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవం

కెవిపిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి ఈశ్వర్

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరులో కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కెవిపిఎస్ ఏర్పాటై 26 సంవత్సరాలు నిండిన సందర్భంగా పలమనేరు పట్టణంలోని సిల్క్ ఫారం కాలనీలో కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్, శాంతమ్మ , సిపిఎం నాయకులు గిరిధర్ గుప్తా ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి అన్నారు ఈశ్వర్ కెవిపిఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా అన్నారు ఈశ్వర్ మాట్లాడుతూ కెవిపిఎస్ 1998 అక్టోబర్ 2న ఆత్మగౌరవం, సమానత్వం కుల నిర్మూలన అనే లక్ష్యసాధన కోసం ఒక చారిత్రక అవసరంగా ఏర్పడిందన్నారు. ఎస్సి, ఎస్టి కమిషన్, ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ చట్టం దళితులకు రెండు ఎకరాల భూమి, శ్మశాన వాటిక స్థలం ఇవ్వాలని జీవో నెంబర్ 1235 దళితులకు100 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వాలని జీవో నెంబర్ 348 సాధించింది, రాజ్యాంగ రక్షణ, రిజర్వేషన్లు పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థలు కాపాడుకోవాలని, ప్రజాస్వామ్యం, లౌకితత్వం, సామాజిక న్యాయం, మత సామరస్యత, టెర్రరిజం వంటి రాజ్యాంగ మూల స్తంభాల రక్షణ కోసం కెవిపిఎస్ నిరంతరం కొనసాగుతుందన్నారు. రెండు గ్లాసుల పద్ధతికి వ్యతి రేకంగా పోరాడి మహనీయుల జ్యోతి బాపూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత పరి రక్షణ కోసం పూర్తిగా పని చేస్తుందన్నారు. ఎల్లవేళలా సామాజిక పోరాటాలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణమ్మ , బాలాజీ, బిబి జాన్, పూజిత, హరి పాల్గొన్నారు.

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

- నేడు ధ్వజారోహణం
- ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి టిటిడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వాహనసేవలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి ఏర్పాట్లు పూర్తిచేసింది. భక్తులందరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రీవారి వాహనసేవలతో పాటు మూలవిరాట్ దర్శనం కల్పించేందుకు టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ సాయంత్రం 6.30 నుండి రాత్రి 11 గంటల వరకు జరుగుతుంది. ఆలయ నాలుగు మాడ వీధులలో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్యాలరీలలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. భక్తులు మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి ప్రవేశించేందుకు, తిరిగి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారీకేడ్లు, క్యూలైన్ల గేట్లు పటిష్టంగా ఏర్పాటు చేశారు.

4న ధ్వజారోహణం

4వ తేదీ శుక్రవారం సాయంత్రం 5.45 నుండి 6 గంటల మధ్య మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. ఈ కార్యక్రమం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. ఆ తరువాత రాత్రి 9 నుండి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరుగుతుంది.

మొదటిరోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై (పెద్ద శేషవాహనం) తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహిస్తారు. 5న చిన్నశేషవాహనం. స్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి శ్రీమలయప్పస్వామివారు వీణాపాణియై హంసవాహనంపై సరస్వతిమూర్తి అవతారంలో దర్శనమిస్తారు. 6న మూడో రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. 7న నాలుగో రోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు. 8న ఐదో రోజు ఉదయం శ్రీవారు మోహినీరూపంలో శృంగారరసాధి దేవతగా భాసిస్తూ దర్శనమిస్తాడు. పక్కనే స్వామి దంతపుపల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు. రాత్రి గరుడవాహనంలో జగన్నాటక సూత్రధారియైన శ్రీమలయప్పస్వామివారు తిరుమాడ వీధులలో నింపాదిగా ఊరేగుతూ భక్తులందరికీ తన దివ్యమంగళ రూపదర్శనమిస్తాడు. 9న ఆరో రోజు ఉదయం శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తాడు. సాయంత్రం శ్రీనివాసుడు స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడు. రాత్రి వేంకటాద్రీశుడు గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తాడు. 10న ఏడో రోజున ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు తిరుమాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. రాత్రి శ్రీమలయప్పస్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ తన రాజసాన్ని భక్తులకు చూపుతాడు. 11న ఎనిమిదో రోజు ఉదయం ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. రాత్రి అశ్వవాహనంపై విహరించి భక్తులను అనుగ్రహిస్తాడు. 12న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన తొమ్మిదో రోజు ఉదయం చక్రస్నానం వేడుకగా జరుగుతుంది. రోజు రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం తరువాత ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా జరుగుతుంది. ధ్వజావరోహణ ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

విద్యుత్ వెలుగులో శోభాయమానంగా తిరుమల

మాజీ ఈవో ధర్మారెడ్డి ఏమయ్యారు..

- శ్రీవాణి ట్రస్టు డబ్బులు దోచేశారు..
- వారాహి సభలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి : శ్రీవారి లడ్డు ప్రసాదంపై ఇంత వివాదం జరుగుతుంటే మాజీ ఈవో ధర్మారెడ్డి ఏమయ్యారు.. ఎక్కడ దాకున్నారు...? ఎందుకు నోరుమెదపడం లేదని రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ విమర్శించారు. తిరుపతి బాలాజీకాలని సర్కిల్ వద్ద గురువారం నిర్వహించిన వారాహి సభలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ మాజీ ఈవో ధర్మారెడ్డి పాలనలో శ్రీవాణి ట్రస్ట్ పేరుతో దర్శనానికి 10,500 వసూళ్లు చేసి, 500 రూపాయలకు మాత్రమే రశీదు ఇచ్చి, మిగత డబ్బులను దోచేశారని విమర్శించారు. తాను తనకి అన్యాయం జరిగిందని బయటకు రాలేదని, సనాతన ధర్మానికి అన్యాయం జరుగుతుంటే వచ్చాను, కల్తీ ప్రసాదాలు భక్తులకు పెట్టారని విమర్శించారు. వాళ్లకు దేవుడు 11 సీట్లు ఇచ్చిన బుద్ధిరాలేదు, వాటిని ఒకటికే పరిమితం చేద్దామని పిలుపునిచ్చారు. తాను ఒక సనాతన హిందుత్వ వాదినిన, నా కూతరు క్రైస్తవ మతాన్ని ఆచరిస్తారని అందుకే తిరుమలలో తన చేత డిక్లరేషన్ ఇప్పించి, తన చిత్తశుద్ధిచాటానని వెల్లడించారు. నేను ఎప్పుడు ధర్మాన్ని తప్పలేదు, ధర్మం కోసం పార్టీని, రాజకీయ జీవితాన్ని వదులుకోవడానికి కూడా సిద్ధమే అన్నారు. జంతువుల కొవ్వు కలిసిన నెయ్యితో తయారైన లక్ష లడ్డులు అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి పంపారని, రాహుల్ గాంధీ కూడా సనాతన ధర్మం గురించి వ్యంగ్యంగా మాట్లాడం సరైనది కాదని అన్నారు. సెక్యులరిజం అంటే హిందుమతాన్ని అపహాస్యం చేయడం కాదని సూచించారు. అదే ఇస్లాం, క్రైస్తవ మతం గురించి విమర్శించే సాహసం చేయరని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం ఒక వైరస్, దానిని అంతం చేస్తామని ఒక యువ నాయకుడు అన్నాడు (తమిళనాడు డిప్యూటీ సిఎం ఉదయగిరి స్టాలిన్‌ను ఉద్దేశించి), సుడో సెక్యూలర్ వాదులకు ఇదే నా హెచ్చరిక సనాతన ధర్మాన్ని తుడిచి పెట్టేయాలంటే వెంకన్నస్వామి చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సనాతన ధర్మం విషయంలో తప్పు జరిగిత ఎవ్వరు మాట్లాడం లేదని, దీనిపై మాట్లాడతే మతోన్మాదులు అవుతామా అని ప్రశ్నించారు. ఆలయ ప్రసాదాల నాణ్యత ధృవీకరించే విధానం తీసుకురావాలని, ఆలయాల కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగా కాకుండా విద్య, కళా, ఆర్థిక, పర్యావరణ, సంక్షేమ కేంద్రాలుగా మారాలని, అందుకు ఓ ప్రణాళిక సిద్ధం చేయాలని డిమాండు చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు కొన్ని వ్యాఖ్యాలు చేసింది, కోర్టులపై తనకు గౌరవం ఉందన్నారు. లడ్డు కల్తీని సాదారణ అంశంగా తీసుకోవద్దని, పవిత్రత ఎలా దెబ్బతిందో ఆలోచించాలన్నారు.

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఎన్నిక

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి -గుడిపల్లి: కుప్పం విద్యుత్ కార్మిక సంఘం ఎన్నిక గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కార్మిక సంఘం ముఖ్య పాత్ర పోషిస్తుందని నిరంత రాయంగా విద్యుత్ వినియోగ దారులకు ఎలాంటి సమస్యలు లేకుండా అహర్నిశలు కష్టపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన సభ్యులను ఏకగ్రీవంగా ఆయన సమక్షంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ టిఎన్‌టియుసి అధ్యక్షులుగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బాలాజీ, ఆనంద్, మురుగేష్, మురుగయ్య, నారాయణప్ప, ట్రెజరర్‌గా రమేష్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి సుగుణాకర్ రావు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

జిల్లా సమన్వయ అధికారి ప్రభావతి

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న జిల్లా సమన్వయ అధికారిణి ప్రభావతి

ప్రజాశక్తి- పూతలపట్టు: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని జిల్లా సమన్వయ అధికారిణి ప్రభావతి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని పి కొత్తకోట గ్రామంలోని సామాజి క ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తేవాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, సదుపాయాలను సమకూర్చడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

గుర్తు తెలియని మృత దేహానికి దహన సంస్కారం

గుర్తు తెలియని మృతదేహాన్ని తీసుకెకుతున్న ముస్లిం జెఎసి సభ్యులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని మహిళ మృత దేహానికి బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు. గత శనివారం 28వ తేదీ రోడ్డు పక్కన నడచి వెళుతున్న మహిళ ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో ఆమె మృతి చెందింది. అప్పటి నుండి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలో మృత దేహాన్ని వుంచారు. ఐదు రోజులు అవుతున్నా మహిళ మృత దేహానికి సంబంధించిన వ్యక్తులు ఎవరూ రాకపోవడంతో సిఐ శ్రీనివాసులు బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ సభ్యులకు తెలిపిశవాన్ని బంగారు పాలెం జమ్మ మసీదులో దహన సంస్కారాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లప్ప, బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్ (అన్ను), ఉపాధ్యక్షులు లాలు, కోశాధికారి షంషీర్ , బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ సభ్యులు సమీర్, రియాజ్, బాషా అంబులెన్సు, ఆరిఫ్ దాదు, హబీబ్, మౌజన్ అర్షద్, అల్తాఫ్, రఫీ, దావూద్ ఖాన్, బల్జిపల్లి బాబు, టీఏస్ సాలిహ, యార్రాపల్లి గౌస్, బంగారుపాళ్యం ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా దేవరాజు నాయుడు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఐరాల మండలం యుటిఎఫ్ గౌరవాధ్యక్షులుగా ప్రభాకర్, అధ్యక్షులుగా దేవరాజు నాయుడు, అసోసియేట్ అధ్యక్షులుగా లీలావతి, జనార్ధన్ ప్రధాన కార్యదర్శిగా అరుణ కుమార్, కోశాధికారి సుధాకర్ లను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం గురువారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు పర్యవేక్షణలో యుటిఎఫ్ మండల నాయకులను ఎన్నుకున్నారు. మండల కార్యదర్శులుగా సుగుణసుందరి, నాగరాజు, కేశవులు , విజయలక్ష్మి , విజయ ప్రసాద్ , రాజా రాణిలను ఎన్నుకున్నారు.

7 నుంచి శ్రీ లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని వేపంజేరి శ్రీలక్ష్మీ నారాయణస్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈనెల 7నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ , అడ్వకేట్ కే.ఎస్ వాసు, ఆలయ మేనేజర్ వెంకటేశులు రెడ్డి గురువారం తెలిపారు. 7వతేది అంకురార్పణ, 8 వతేదిన ధ్వజారోహణం, శేష వాహనం, సింహవాహనం, 9వతేదీ మోహిని అవతారం, కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం, 10 వ తేదీ హనుమంత వాహనం, గజ వాహనం, 11 వతేది రథోత్సవం, అశ్వావాహనం 12 వ తేది చక్రస్నానం , ద్వాదశ ఆరాధనం, ధ్వజ అవరోహణతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: ఠూగుండ్రం గ్రామంలో శ్మశాన రహదారికి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అధికారులు, టిడిపి నేతలు గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఠూగుండ్రం సర్పంచ్ శ్రీ బాబు, మాజీ పిహెచ్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నర్సింహులు నాయుడు, పార్లమెంట్ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, ఠూగుండ్రం టిడిపి కమిటీ అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్, పంచాయతీ కార్యదర్శి మురళి, వీఆర్ఓ శిరీష, వెల్ఫేర్ అసిస్టెంట్ హరీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యువరాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ, నేత కమల్ పాల్గొన్నారు.

'పొలం బడి'తో అధిక దిగుబడులు

సలహాలు, సూచనలు అందిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - వెదురుకుప్పం: పొలం బడితో అధిక దిగుబడులు సాధించ వచ్చని మండల వ్యవసాయాధికారి వనిత పేర్కొన్నారు. మండలం లోని సంతబైలు, మొండివెంగన పల్లి గ్రామాలలో 'పొలం పిలు స్తోంది'ని గురువారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా తక్కువ పెట్టుబడి, ఖర్చులతో అధిక దిగుబడులు సాధించి రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం , వ్యవసాయ శాఖ వారి ద్వారా అమలు అవుతున్న ప్రభుత్వ పథకాలు పట్ల పరిజ్ఞానం శాఖ వారి ద్వారా అమలువుతున్న ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. రైతు పొలాలను మండల వ్యవసాయ అధికారి వనితసిబ్బందితో కలిసి పరిశీలించారు.

వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి ఛాంబర్ నుంచి కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్, జాయింట్ డైరెక్టర్ (టిబి) గురువారం లెప్రసీ, టిబి గురించి డిస్ట్రిక్ట్ టీమ్స్ కి జూమ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ ట్రైనింగ్ సెషన్‌లో డి ఎం హెచ్ ఓ , డ్లాటో ఆఫీసర్, ఒక డాక్టర్ ట్రైనింగ్ తీసుకున్న డాక్టర్ అన్ని పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్లకు టి.బి , లెప్రసీ పై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. శుక్ర, శని వారాల్లో రెండు రోజులు జిల్లాలోని అందరి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లకు డి ఎం హెచ్ ఓ ఆఫీస్ లో రెండు రోజులు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. తద్వారా మెడికల్ ఆఫీసర్లు సి.హెచ్. ఓ ,ఎఎన్ఎం ,ఆశా కార్యకర్తలకు వారి వారి పిహెచ్ ట్రైనింగ్ ఇచ్చి టి.బి లెప్రసీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి పద్మ ,లెప్రసీ, టీబీ స్టాఫ్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -వికోట : మండల కేంద్రమైన వికోట లోని దుర్గా నగర్ లో వెలసిన దుర్గా మాత దేవాలయంలో గురువారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు బాల త్రిపుర సుందరి(మహాలక్ష్మి) అవతారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి దుర్గమ్మ వారికి సంప్రదాయబద్దంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారి దేవాలయాన్ని అంగరంగ వైభవంగా రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం శాస్త్రోక్తంగా అమ్మవారికి హోమాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు బాలా త్రిపుర సుందరి అలంకరణలో (మహాలక్ష్మి)దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారి దీక్ష వహించిమొక్కులు చెల్లించుకున్నారు. దుర్గ దీక్షలు ప్రారంభించి 11 రోజులు దీక్ష నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, తుకారాం, విజయ్ కుమార్ రాజు తోపాటు పాలకవర్గ సభ్యులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కాణిపాకం బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే

జెసి విద్యాధరికి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయకుని వార్షిక బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. కాణిపాకం దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించి విజయవంతంగా ముగిసిన సందర్భంగా గురువారం ఉదయం కాణిపాకం దేవస్థానం ఆస్థాన మండపంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల కృతజ్ఞత సమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, ఉభయదారులకు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాక ఆలయ ఈవో గురుప్రసాద్ కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబరు 7వ తేదీ నుండి 27వ తేదీ వరకూ నిర్వహించిన కాణిపాక బ్రహ్మోత్సవాలు ఉభయదారులు, జిల్లా అధికారులు సహకారంతో విజయవంతంగా ముగిశాయన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించామన్నారు. ప్రతి చిన్న ఉద్యోగి నుండి ఉన్నతాధికారులు వరకూ అంకితభావంతో పని చేశారని ప్రశంసించారు. ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులను, పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు బ్రహ్మోత్సవాల సమయంలో కాణిపాకం పురవీధుల్లో ఎలాంటి చెత్తా చెదారంలేకుండా 24 గంటలు స్వామి వారికి సేవ లందించారని ప్రశంసించారు. తిరుమల తరహాలో పారిశుధ్య పనులు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జెసి విద్యాధరి, చిత్తూరు ఎస్‌పి మణికంఠ చందోలు, కాణిపాకం ఆలయ ఈవో పెట్టెం గురుప్రసాద్, మాజీ ఆలయ కమిటీ ఛైర్మన్ మణినాయుడు, నియోజకవర్గ, మండల నాయకులు, ఉభయదారులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలోని గిరిజనులను ఆదుకొని వారిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన రామకుప్పం మండల పరిధిలోని ననియాల, పిఎంకె తండాలలో పర్యటించి స్థానిక గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ ఆధారిత జీవనాధారంగా బతుకుతెరువు సాగిస్తున్న గిరిజనుల పంట పొలాలపై గత కొంతకాలంగా ఏనుగులు దాడులు చేసి స్థానిక గిరిజన రైతులకు సంబంధించిన ప్రాణ, పంట నష్టాలపై సమగ్ర నివేదిక రూపొందించి, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం ప్రత్యేక అధికారి వికాస్ మరమ్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, తహశీల్దార్ బాబు, ఎంపీడీవో లక్ష్మీకాంత్, కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్, స్థానిక టిడిపి ముఖ్య నేతలు మునుస్వామి, ఆనంద్ రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, చిన్ని కృష్ణ , చలపతి, రామూర్తి, సుబ్రీ,బాలు ,జనసేన హరిష్, కృష్ణా నాయక్, కామ్రాజ్ నాయక్, గంట్లప్ప గౌడ్,ఏ పి ఒ రవికుమార్, ఏపీఎం శ్రీనివాసమూర్తి, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి: కమిషనర్

విలేకరులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు కోరారు. గురువారం పురపాలక సంఘం కార్యాలయం లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పారిశుద్ధ్య పనులు విస్తృతంగా నిర్వహిస్తున్నామని, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, ప్రతి ఒక్కరూ ఇంటిలోని చెత్తను చెత్త వాహనాలకు అందించాలే తప్ప రోడ్లపై పడవేయకూడదని సూచించారు. ముఖ్యంగా పట్టణ పరిధిలో డ్రోన్ల సాయంతో వీడియోలు తీస్తున్నామని, వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. పురపాలక సంఘం నిర్వహణకు సంవత్సరానికి 10 కోట్ల రూపాయల ఖర్చు వస్తుందని కానీ ఆదాయం 2 కోట్లు మాత్రమే ఉన్నట్టు తెలిపారు. ఈ ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, సురేష్, సెల్వం, నాయకులు జాకిర్ అహ్మద్, వేలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో సకాలంలో వర్షాలు: ఎమ్మెల్యే

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి -ఐరాల: మొక్కల పెంపకంతో సకాలంలో వర్షాలు పడి పాడి పంటలు వృద్ధి చెందుతాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల మేరకు గురువారం సాయంత్రం కాణిపాకంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పూతల పట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ మాట్లాడుతూ కాణిపాకం దేవస్థానం పరిసర ప్రాంతాల్లో డార్మెటరీ హాల్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో కాణిపాకం దేవస్థానం ఈవో గురుప్రసాద్ తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ముఖ్యమైన రోజుల్లో మొక్కలను నాటి పెంచాలని కోరారు. భావి తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంను చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, కాణిపాకం దేవస్థానం మాజీ ఛైర్మన్ మణి నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టార్గెట్‌ల వేధింపులు ఆపాలి

ఏఐజిడిఎస్‌యు డివిజన్ కార్యదర్శి అరుణ

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: టార్గెట్ల పేరుతో తపాలా శాఖ సిబ్బందిని వేధించడం మానుకోవాలని ఏఐజిడిఎస్‌యు డివిజన్ కార్యదర్శి అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయ ఆవరణలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని తపాలా శాఖలో టార్గెట్లు నిర్ణయించే పనిలో ఒత్తిడి చేస్తున్నారని దీని వల్ల తపాలా శాఖ సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారని వేధింపులు మాని తపాలా శాఖ యథావిధిగా కొనసాగే విధంగా చూడాలని యూనియన్ల పిలుపు మేరకు ఈనెల మూడు, నాలుగు, ఐదు తేదీల్లో నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజ నేయులు, పాండు, రవి, కుమారి, అనురాధ పలువురు తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం

పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ గురువారం ఘన సన్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సభలో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులైన సురేష్ , పవలకొడి, కస్తూరిలను స్థానిక సర్పంచ్ డివి డిల్లయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి నాయకులతో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి స్వీట్లు పంచి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి కావలసిన మౌలిక వసతులు, ఉపాధి హామీ, రెవెన్యూ, ఇరిగేషన్ , పారిశుద్ధ్యం, ఆరోగ్యం, నీటి సమస్యలు, విద్య, రోడ్డు గ్రామంలోని పలు సమస్యలపై గ్రామస్తులు అడిగిన సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే , ఎంపీ దృష్టికి తీసుకెళ్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యేసు రత్నం, యోగిశ్వర్ నాయుడు, సూరి రెడ్డి, సతీష్, వజ్రావేల్ రెడ్డి, జీవన్ కుమార్, సచివాలయ, అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , రెవెన్యూ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభ


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి అధికారులు

ప్రజాశక్తి -శాంతిపురం : మండల పరిధిలోని కెనమాకులపల్లి గ్రామ పంచాయతీలో గురువారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఏవి జయరాం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం 2025-26 కు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు, వార్షిక ప్రణాళిక తయారీ గురించి గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో కుప్పం నియోజకవర్గ ఎన్ఆర్ ఈజిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ రైతుల పొలాలు అభివృద్ధి పనులు, గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే పనులు, గ్రామ మౌలిక వసతులు సిసి రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, డ్రైనేజీలు నిర్మాణ పనులు గ్రామ స్థాయిలో ఈ నెల అంతా గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఈడుగ రమేష్ ,బూత్ కన్వీనర్ భాష్యం కేదారనాథ్ నాయుడు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు రాజారెడ్డి, మాజీ సింగల్ విండో డైరెక్టర్ రాధాకృష్ణ, మాజీ ఎంపిటిసి కృష్ణప్ప, పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ జై చంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రూప, ఉపాధి హామీ కూలీలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు

రక్త గ్రూపు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి లావణ్య కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద మాట్లాడుతూ హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించామని రక్త గ్రూపును తెలుసుకోవడం చాలా ముఖ్యమన్నారు. రక్తం మార్పిడి సమయంలో రక్త గ్రూప్ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. 40 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు జరిపి, వారికి ఎంత శాతం రక్తం ఉందో తెలిపారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం సబ్ సెంటర్ ఏఎన్ఎం ఎర్రసానమ్మ, ఆర్ఆర్‌సి కమిటీ మెంబర్స్ డాక్టర్ అరుణ, శ్రీనివాసులు రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకే తరులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మ దసరా ఉత్సవాలు ప్రారంభం

ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- ఎస్ ఆర్ పురం : మండలంలోని వివి పురం గ్రామ పంచాయతీ ఆరిమాకుల పల్లిలో వెలిసిన ఆరిమాని గంగమ్మకు గురువారం నవరాత్రి ఉత్సవంలో భాగంగా శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ పూజారి వెంకటాచలపతి ఆచార్యులు ముందు అమ్మవారికి బాల గణపతి హోమం, కనకదుర్గ దేవి హోమం, మహా మంగళ హారతి , అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మంగుంట గ్రామానికి చెందిన హిమాచలపతి రెడ్డి పద్మావతమ్మ , అడ్వకేట్ రమేష్ రెడ్డి భార్గవి దంపతులు కుటుంబ సభ్యులు అమ్మవారికి మంగుంట గ్రామం నుంచి సారే, పుట్ట మట్టి తెచ్చి అంకురార్పణ చేసి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఆలయ ఆర్చి దాత బోడపాటి ఆనంద నాయుడు ఉభయదారులుగా మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు హిమాచలపతి రెడ్డి, జలంధర్ నాయుడు సిద్ధయ్య శెట్టి, కర్ణం జయచంద్ర నాయుడు, వెంకటరమణ, యార్వ మునిరెడ్డి, హేమాద్రి యాదవ్ ఆలయ కార్యనిర్వాహణాధికారి తిమ్మారెడ్డి, తదితరుల సమక్షంలో పోలీసుల ఆధ్వర్యంలో తయ్యూరు పాయకట్టు18 గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : రెండు రోజుల క్రితం ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. బైరెడ్డిపల్లి-పుంగనూరు జాతీయ రహదారిలో చిన్న చల్లారగుంట సమీపంలో మంగళవారం లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో యుగంధర్ గౌడు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు అతని కుటుంబ సభ్యులకు వైద్యులు సమాచారం అందించారు. అతనికి భార్య సి భారతి, కుమార్తె సి చందన, కుమారుడు సి చక్రధర్ ఉన్నారు. ఆయన మృతి పట్ల ఆకుల కొత్తూరు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు. యుగంధర్ గౌడ్ తో పాటు ద్విచక్ర వాహనంలో పయనిస్తున్న గాయపడ్డ చలగానిపల్లి గిరిరాజా కుప్పం పిఈఎస్ హాస్పిటల్‌లో చికిత్స పొందు తున్న అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలపడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకి తరలించినట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాల ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -విజయపురం (నింద్ర): పాల ట్యాంకర్ ఢీకొని తమిళనాడుకు చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నింద్ర జగనన్న కాలనీ సమీపంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు...తమిళనాడు, వెళ్ళతుకోటై, రాజీపాలెం గ్రామానికి చెందిన ఆనందవర్మ (55) ద్విచక్రవాహనంలో పిచ్చాటూరు నుంచి తిరుత్తణి వైపు వెళుతుండగా నింద్ర జగనన్న కాలనీ సమీపంలో ఓ పాల ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి, తన ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలో కొత్త వెంకటాపురం పంచాయతీకి చెందిన యువతి అదృశమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీ కెవి దొడ్డిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి సుమిత్ర దంపతుల కుమార్తె రాజేశ్వరి (19) గత మంగళవారం నుండి కనబడడం లేదని తల్లిదండ్రులు గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడి నెల్లూరు సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మాట్లాడుతున్న ఉద్యాన వన అధికారి

మట్టి నమూనాలపై శిక్షణ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ' కార్యాలయంలో ఉద్యాన సిబ్బందికి 'డిజిటల్ గ్రీన్ సంస్థ' ఆధ్వర్యంలో 'మట్టి నమూనా పరీక్షలపై గురువారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పం "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" కార్యాలయ ఉద్యాన సహాయ సంచాలకులు యు. కోటేశ్వరరావు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యాన సహాయకులకు, సిబ్బందికి మట్టి నమూనా వాటి ప్రాముఖ్యత, పరీక్షల విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రైతు సేవ కేంద్ర సిబ్బందికి మట్టి పరీక్షల కిట్లను పంపిణీ చేశారు. రైతు సేవా సిబ్బంది గ్రామీణ రైతులకు రైతు కేంద్రాల ద్వారా మట్టిలోని మూల పోషకాలు, వాటి పరీక్షలు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రైతులు సద్వినియోగపరుచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఉద్యాన అధికారి ఎం. డింపుప్రియాశ్రీ, శాంతిపురం మండలం ఉద్యాన అధికారి పి. వింధ్య, డిజిటల్ గ్రీన్ సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ యశోద, కుప్పం నియోజకవర్గ పరిధిలోని ఉద్యాన సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎడ్యుకేటర్ సావిత్రి

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బాల్య వివాహాలు, మాతా శిశు మరణాలు వల్ల సంభవించే అనర్థాలపై హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి గురువారం అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారిగా ఆదేశం మేరకు మండల కేంద్రంలో వివో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేటర్ ఆరోగ్య విద్య బోధిస్తూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపారు. పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, ప్రాముఖ్యత, వ్యక్తిగత శుభ్రత, రక్తహీనత, నివారణ, సీజనల్ వ్యాధులు, డయేరియా నివారణ నియంత్రణ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఓ లీడర్లు, ఆశ వర్కర్ ముబీనా పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం నాయనూరు గ్రామంలో టిడిపి అధ్యక్షులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మురుగేష్ పాల్గొని తన చేతుల మీదుగా అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధ రహిత సమాజాన్ని నిర్మించే క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచితంగా కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా అందించడంతో పాటు శస్త్ర చికిత్సలు అం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ ఎర్ర నాగుల వారి పల్లె గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మేనక ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామంలోని మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం పిచ్చి మొక్కలు తొలగించడం బ్లీచింగ్ చల్లడం చేయించినట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పించి దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై తెలిపామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు
E.P. No. 10/2024 in O.S. No. 193/2021
బిట్వీన్:
షేక్ బాబ్‌జాన్ ... డిహెచ్ఆర్ /వాది
V/s
ఎన్.దివ్య, భర్త : జమీర్ అహమ్మద్, నివాసం : డోర్ నెం. 22-1093, 3వ లైన్, ఎస్‌బిఐ కాలనీ, చిత్తూరు ...జెడిఆర్ / ప్రతివాది
పై నెంబరు గల పిటీషన్‌లో మీరు జెడిఆర్/ ప్రతివాది అయివున్నావు. శ్రీ కోర్టువారి నుంచి ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా పై పిటీషన్ తేది : 18-10-2024వ తేదీన వాయిదా వున్నదని తెలియజేయడమైనది. కావున వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ చేసుకోవలసినది లేనిచో మీ పరోక్షమున వాయిదా తీర్మానించబడునని తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 18-10-2024
డి.వి.నాగరాజు,
డిహెచ్ఆర్ / వాది తరఫు న్యాయవాది,
చిలకలూరిపేట.